క్లుప్తంగా

హ్యాపీ బర్త్‌డే సార్..



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న బాలశివుడు గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల బాలశివుడు గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పలువురు నగరంలో మంత్రిని కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామానికి వీధిలైట్ల వితరణ



వీధిలైట్లను అందజేస్తున్న దాత

ఇబ్రహింపట్నం: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముకునూర్ గ్రామానికి ఇటుకల సత్యనారాయణరెడ్డి వీధిలైట్లను వితరణ చేశారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ వెంకటమ్మ, జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్ సమక్షంలో సోమవారం 36 వాట్స్ సామర్థ్యం గల 30 లైట్లను జీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతను అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామం బీసీకాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజబుర్ రెహమాన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసమూర్తిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అజీజ్, పంచాయతీరాజ్ ఏఈ విక్రం రెడ్డి, స్థానిక నాయకులు నర్సింహ, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, యాదయ్య, దర్శన్, అభిలాష్ గౌడ్, విజయ్ యాదవ్, బాలస్వామి, రవి, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నోటీసులు జారీ



నోటీసులు అందజేస్తున్న ఎంఈఓ పాండు

ఆమనగల్లు: పట్టణంలోని లెనోరా ప్రైడ్ ఉన్నత పాఠశాలకు ఎంఈఓ పాండు నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో బాలురు, బాలికలకు ఒకే మూత్రశాల, మరుగుదొడ్ల ఏర్పాటుపై గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన.. వేరువేరుగా మూత్రశాలలు ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంఈఓ స్కూల్‌ను తనిఖీ చేయగా.. పరిస్థితిలో మార్పు కానరాకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. విడివిడిగా మూత్రశాలల ఏర్పాటుపై సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంకర రోడ్డుతో ఇబ్బంది



మైసిగండి ఆలయ రోడ్డు దుస్థితి

కడ్తాల్: మండల పరిధి మైసిగండి శివరామాలయాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీశైలం – హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మైసిగండి గ్రామ సమీపానికి ఆలయాలు కిలో మీటరు దూరంలో ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితం హైవే నుంచి గుడికి బీటీరోడ్డు వేశారు. నాటి నుంచి రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో తారు మాయమై.. కంకర తేలింది. గోతులు ఏర్పడి భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. భక్తులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అటకెక్కిన అభివృద్ధి

పాతబస్తీపై పాలకుల నిర్లక్ష్యం

- రూ.36.50 లక్షలతో ఆర్భాటంగా నిర్మాణ పనులు ప్రారంభం..
- ఏడాది గడిచినా.. పూర్తికాని షెడ్లు, డ్వాక్రా భవనం, బస్తీ దవాఖానా
- నెరవేరని బస్తీవాసుల కల



అసంపూర్తి నిర్మాణాలు

ఇబ్రహీంపట్నం: పాతబస్తీ అభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన దుకాణ షెడ్లు, ప్రభుత్వ దవాఖాన, డ్వాక్రా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఆర్భాటంగా ఏడాది క్రితం ప్రారంభించిన పనులు నేటికీ.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా మిగిలాయి. దీంతో అభివృద్ధి పనులతో ప్రాంతం కళకళలాడుతుందనుకున్న ప్రాంత వాసుల కల కలగానే మిగిలిపోయింది.

నిధులు లేక!

పట్నం పాతబస్తీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ను గతంలో ప్రధాన రహదారిపైకి తరలించారు. దీంతో ఆ స్థలం ఖాళీగా ఉంది. అనంతరం అక్కడ మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకును నిర్మించారు. తదనంతరం మిగతా స్థలంలో దుకాణ సముదాయం(షెడ్లు), దవాఖాన, డ్వాక్రా భవన నిర్మాణాలకు నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 2023లో రూ.9.50 లక్షల పట్టణ ప్రగతి నిధులతో షెడ్లు, అక్టోబర్ 2023న రూ.15 లక్షలు డీఎంఎఫ్‌టీ నిధులతో డ్వాక్రా భవనం, రూ.12 లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులతో బస్తీ దవాఖాన నిర్మాణ పనులకు నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో పూర్తి కావాల్సిన భవనాలు.. నేటికీ పూర్తికాలేదు. షెడ్లు, దవాఖాన పూర్తికావచ్చింది. కానీ డ్వాక్రా భవన నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారాయి. నిర్మాణ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ఆగిపోయినట్లుగా తెలుస్తోంది.



ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు

అధికారుల నిర్లక్ష్యం



పాతపట్నం వెనుకబడిన ప్రాంతం. బస్తీ అభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన భవనాల నిర్మాణ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్భాటంగా ప్రారంభించి, వదిలేశారు. ఏడాది గడిచినా.. పనులు పూర్తి కావడం లేదు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుని, భవన నిర్మాణం పూర్తి చేయించాలి.

– విజయ్‌కుమార్, పాతబస్తీ, ఇబ్రహీంపట్నం

త్వరలో పూర్తి చేయిస్తాం



దుకాణ సముదాయం (షెడ్లు), బస్తీ దవాఖాన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. త్వరలో వినియోగంలోకి తెస్తాం. వ్యాపారులకు మడిగెలు కేటాయిస్తాం. ఆస్పత్రి భవనాన్ని ఆరోగ్య శాఖకు అప్పగించాం. అదికూడా త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తపస్ జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 22లోగా పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా మహిళా ప్రముఖ్ వనం సుమరంజిత డిమాండ్ చేశారు. లేని పక్షంలో 23 నుంచి ధర్మాగ్రహ దీక్ష చేపడతామని హెచ్చరించారు. తపస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఆమె ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన 4 డీఏలు, ఈ- కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టు తెప్పించుకుని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినా.. టీచర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. గడువులోగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గౌరవ అధ్యక్షుడు భాస్కర్, మహిళా మండల కన్వీనర్ మాధవి ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

లింగేశ్వర ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- ఎంపీడీఓ బాల శంకర్
- వేడుకల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాల శంకర్

మంచాల: బుగ్గ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సోమవారం ఆరుట్లలో వివిధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో పదిహేను రోజుల పాటు నిర్వహించే వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించడం, ఆలయం ముస్తాబు వంటి చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు స్నానమాచరించడానికి, తాగడానికి నీటి సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. దుకాణ దారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విష్ణు వర్ధన్‌రెడ్డి, యాదయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు రమేష్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ సంబురాలు



వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: సదర్ సంబురాలు అంబరాన్నంటాయి. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతుల ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు దశరథం, కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి యాదయ్య, నాయకులు చెన్నయ్య, పర్వతాలు, నాయకులు పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, మిట్టపల్లి అంజయ్య, ముజబుర్ రెహమాన్, శ్రీను, శ్రీదర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ఎజెండా

- మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి
- రూ.50 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమం, మున్సిపాలిటీ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఆదిబట్ల చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పురపాలికను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని పేర్కొన్నారు. సోమవారం పుర పరిధి 15వ వార్డులో రూ.30 లక్షలు, 9వ వార్డు మమ్మరాజుగూడలో రూ.5 లక్షలు, 11వ వార్డు బొంగ్లూర్ దర్గా దగ్గర రూ.10 లక్షలు, 1వ వార్డులో రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో విడతల వారీగా అన్ని వార్డులను సమాంతరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరి, కౌన్సిలర్లు మర్రి అర్చన రాంరెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, డీఈ స్వర్ణకుమార్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేదల భూములు లాక్కుంటే సహించం

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్
- భూ కబ్జాదారులపై చర్యలకు డిమాండ్



భూమిలో జెండాలు పాతిన సీపీఎం నాయకులు

కందుకూరు: పేదల భూములు లాక్కుంటే సహించేదిలేదని, వారి భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధి నేదునూరు రెవెన్యూ సర్వే నంబర్ 154లోని భూమి చుట్టూ జెండాలు పాతి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 154లో 1.35 ఎకరాల భూమిని నాడు జాగీర్‌దార్లు హరిజనులకు ఇనాముగా ఇచ్చారని తెలిపారు. 1954 నుంచి ఆ భూముల్లో వారు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అప్పటి నుంచి 1993 వరకు భూ రికార్డుల్లో వారి పేర్లే ఉన్నాయని వెల్లడించారు. అనంతరం ఎలాంటి ఫైల్ నంబర్ లేకుండా, గ్రామానికి చెందిన మునగాల వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి ఆ భూమిని తన పేరున పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పేదల పక్షాన నిలబడి, ఆ భూమిని స్వాధీనం చేసుకుని, చుట్టూ హద్దులు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఆర్డీఓగా జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు ఆర్డీఓగా ఎన్.జగదీశ్వర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేసిన సూరజ్‌కుమార్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందడంతో.. నాటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. తాత్కాలికంగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నర్సాపూర్ ఆర్డీఓగా పని చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేసింది. బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

బీజేపీ బలోపేతానికి కృషి



సభ్యత్వం అందజేస్తున్న పార్టీ శ్రేణులు

యాచారం: పార్టీని మరింత బలోపేతం చేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. సోమవారం మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మోదీ సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ.. సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కమిషనర్‌గా సరస్వతి



బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌గా సరస్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పనిచేసిన జి.రఘుకుమార్‌ను హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఇబ్రహింపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సరస్వతి ఇక్కడికి వచ్చారు.

జల్‌పల్లికి.. వెంకట్రామ్



పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బి.వెంకట్రామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వాణిరెడ్డి తుక్కుగూడకు బదిలీ కాగా, తుక్కుగూడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామ్ జల్‌పల్లికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు చైర్మన్ అబ్దుల్లా సాదితో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

మీర్‌పేటకు.. జ్ఞానేశ్వర్



మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కమిషనర్‌గా ఆర్.జ్ఞానేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన బి.చంద్రశేఖర్ బదిలీపై ఘట్‌కేసర్‌కు వెళ్లారు. జ్ఞానేశ్వర్.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేసి బదిలీపై మీర్‌పేటకు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది జ్ఞానేశ్వర్‌ను శాలువాతో సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రభులింగం జ్ఞాపకార్థం వారి కుమారులు కట్టా చంద్రశేఖర్, శ్రీనివాస్, రవి, రాజేందర్‌లు రూ.1లక్ష 11వేల 116ల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయకమిటీ సన్మానించింది.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

మండల విద్యాధికారి పాండు



విద్యార్థినులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఆమనగల్లు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ పాండు సూచించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు, జిల్లాస్థాయి టోర్నీలో మొదటి బహుమతి అందుకున్న విద్యార్థులకు పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రినాలిసా, తపస్య, వాలీబాల్ టీమ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఆమనగల్లు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగడానికి చదువుతో పాటు ఆటల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాబేర్, జోనల్ సెక్రటరీ భీముడు, తలకొండపల్లి పీఈటీ పాండు, మాడ్గుల పీఈటీ విజయ్‌రాథోడ్, ఆమనగల్లు పీఈటీ రిజ్వానా, విద్యాభారతి పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మల్లేశ్, నజీర్, అ్రజ, స్వప్న, రత్నకుమారి, పీఈటీలు శంకర్, అంజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్

తొలి మహిళా కమిషనర్‌కు స్వాగతం పలికిన సిబ్బంది



కమిషనర్ వాణిరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా అల్లూరి వాణిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన బి.వెంకట్రామ్ జల్‌పల్లి మున్సిపాలిటీకి బదిలీ కాగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న వాణిరెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు పుర సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. ఇదిలా ఉండగా.. మున్సిపాలిటీకి మొదటి మహిళా కమిషనర్ వాణిరెడ్డి కావడం గమనార్హం. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సినియర్ అసిస్టెంట్లు వెంకటేశం, మల్లేశ్, సిబ్బంది జంగయ్య, సుమతి, మహేశ్, దేవేందర్, నగేష్ తదితరులు ఉన్నారు.

డివిజన్లలో మౌలిక సౌకర్యాలకు కృషి



మారుతీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

- మేయర్ చిగురింత పారిజాత
- కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు లింగం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, మాజీ అధ్యక్షుడు మల్లన్నగౌడ్, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌కుమార్‌గౌడ్, కాలనీవాసులు అజయ్, వెంకట్, రమాదేవి, శ్రీకాంత్, దేవేందర్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో..

అల్మాస్‌గూడలోని 24వ డివిజన్ విశాఖనగర్, ఆర్‌వీఆర్ కాలనీల్లో మేయర్ పారిజాత స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డితో కలిసి సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా కొనసాగాలని వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు, కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దీపావళి కానుకలు పంపిణీ

పహాడీషరీఫ్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ మహిళలకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ కానుకలు అందజేశారు. పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో సమకూర్చిన చీరలు, ఆహార పదార్థాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. పండుగలకు వృథా ఖర్చులు చేయకుండా పేదలకు అండగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.